
# 9

## డా॥ ధేనువకొండ శ్రీరామమూర్తి




ఆపరేషన్ థియేటర్ దగ్గర సహజంగా వుండే గంభీర వాతావరణం, థియేటర్ స్టాఫ్ ముఖాలలో ఆందోళన, హడావుడి చూసి శివకుమార్‌లో మరింత ఆందోళన మొదలైంది. నివారించలేని విపత్తు ఏమైనా జరిగిందా? కావేరికి ఎట్లా వుంది. బిడ్డ గతి ఏమైంది? గుండె బరువెక్కిపోయింది శివకుమార్‌కి, ఎవ్వరిని లోపలికి రానివ్వరు. అదొక ఆందోళన.



# చిగురించని శిశిరం

కావేరి నెల తప్పినప్పటినుంచి క్రమం తప్పకుండా డా॥ శ్రీలత పర్యవేక్షణలో హెల్త్ చెకప్ జరుగుతుంది. డా॥శ్రీలత నగరంలోనే పెద్ద పేరున్న స్పెషలిస్ట్. మంచి హస్తవాసి. నిజానికి ఆ కార్పొరేట్ హాస్పటల్ డా॥శ్రీలత ప్రాభవంతోనే ప్రాచుర్యంలోకి వచ్చింది.

శివకుమార్ బి.టెక్. పూర్తి కాగానే వెంటనే క్యాంపస్ సెలక్షన్ మంచి కంపెనీలో ప్లేస్‌మెంట్ కుదిరింది. ఉద్యోగంలో చేరగానే అక్క కూతుర్ని పెళ్లి చేసుకొమ్మని తల్లి వత్తిడి చేసింది. మేనరికాల వల్ల రాబోయే పరిణామాలు జెనెటిక్ విషయాలు విడమరిచి తల్లికి చెప్పాడు. తల్లి ససేమిరా అంది. వాడికి ఇష్టం లేనప్పుడు వద్దులే అని వారించాడు మేనమామ.

మేనమామ కూతురు రాజేశ్వరి వివాహానికి శివకుమార్ ఆర్థికసహాయం చేసి తన పెళ్ళికన్నా ముందే ఆమె వివాహం జరిపించి కావేరిని శివకుమార్ పెళ్ళి చేసుకున్నాడు.

కావేరికి సిజేరియన్ అవసరమని డా॥శ్రీలత నిర్ధారించింది. "ఈ రోజు గాని రేపు గాని కావేరికి సెక్షన్ చేస్తాం. నార్మల్ డెలివరి కోసం వెయిట్ చేయటం మంచిది కాదు" అంది.

మంచిరోజయితే ఐదారు రోజులదాకా లేదు అంది కావేరి తల్లి. డా॥ శ్రీలత మాత్రం ఈవేళో రేపో అంటోంది. "డాక్టర్లు అట్లాగే అంటారు. మంచి రోజు ముఖ్యం కదా" అంటోంది తల్లి. నొప్పులు సర్దుకోవటం లేదు కావేరికి. వెంటనే అంబులెన్స్ పిలిపించి హాస్పిటల్‌కు చేర్చారు కావేరిని. డా॥శ్రీలత పరీక్ష చేసి కేకలేసింది "చదువుకున్న మూర్ఖులు" అంటూ.

సిజేరియన్ సెక్షన్ ద్వారా బేబిని బయటకు తీయడం, పరిచర్యలు చేయడం ప్రారంభించారు. బిడ్డ ఏడవలేదు. అసిస్టెంట్ డాక్టర్ రమణిలో కంగారు మొదలైంది. బిడ్డలో హైపోక్సియా మొదలైంది. ఆక్సిజన్ సరఫరా పరిశీలించి ఇంకుబేటర్‌లో ఉంచే ఏర్పాట్లు చేశారు. బ్లూ బేబి కండిషన్ కూడా డెవలప్ అవడంతో 'నియోనేటర్ కేర్'కు మార్చారు.

శివకుమార్‌కు డా॥ శ్రీలత కనబడలేదు. సాయంకాలం పిలిపించింది ఆమె ఛాంబర్‌లోకి.

"రండి శివకుమార్ గారూ! ఇవ్వాళ రొటీన్ చాల హెక్టిక్‌గా జరిగింది. మీకు డెవలప్‌మెంట్స్ కన్వే చేయలేకపోయాను. కొంచెం కాంప్లికేషన్స్ డెవలప్ అయ్యాయి."

"సివియర్ ప్రాబ్లమ్స్ ఏవీ లేవుగా మేడం?"

"లెటజ్‌సీ" అంటూ లోనికి వెళ్ళింది.

ఏమిటి? ఏమిటిది? ఏమైంది. ఆందోళన మొదలైంది శివకుమార్‌లో. శివకుమార్ భోరున ఏడ్చాడు.

డా॥శ్రీలత మళ్ళీ రూంలోకి వచ్చేసరికి శివకుమార్ ఏడుస్తున్నాడు. డా॥శ్రీలత భుజంమీద చెయ్యేసి "కంట్రోల్ యువర్‌సెల్ఫ్" అంటూ ఓదార్చింది.

"మీవాళ్ళెవరూ రాలేదా?"

"రాలేదు."

"బేబికి కొంచెంగా కన్వల్షన్స్ వస్తున్నాయి. కాస్త జాగ్రత్త అవసరం. నియోనాటల్ స్పెషలిస్ట్ కూడా అటెండ్ అవుతున్నారు. డోన్ట్‌వర్రీ. నో ప్రాబ్లం."

"ఎందుకు ఇలా అవుతుంది మేడం. ఈజ్‌దేర్ ఎనీ రాంగ్?"

"అన్నీ సెటిల్ అవుతున్నాయి. అమ్నియాటిక్ ఫ్లూయిడ్ పోయింది. బిడ్డ మెదడుకు ఆక్సిజన్ తగ్గింది. అందకే వెంటనే రావద్దా అని తిట్టింది."

"కావేరికి ఏమీ కాలేదుగా మేడం!"

"షి యీజ్ ఫర్‌ఫెక్ట్ ఆల్ రైట్"

నెలలు గడిచేకొద్దీ బిడ్డలో పెద్ద తేడా ఏమీ కనపడటం లేదు. కావేరిలో మునుపటి ఉత్సాహం లేదు. కొద్దికొద్దిగా కోలుకుంటోంది. కావేరి తల్లి ఆమెకు తోడుగా అక్కడే వుండిపోయింది.

చేతులు వణుకుతున్నాయి. ఫిట్స్ తరుచుగా వస్తున్నాయి. డిలేడ్ మైల్‌స్టోన్స్ అనుమానంతో ప్రసిద్ధ డాక్టర్ మాథుర్ దగ్గరకు శివకుమార్ తీసుకెళ్ళాడు బిడ్డను.

"దిస్ బేబి ఈజ్ స్పెషల్ చైల్డ్. సారీ! బిడ్డకు సెరిబ్రల్ పాల్స్ లక్షణాలున్నాయి. కొంచెం జాగ్రత్తగా ప్రత్యేకంగా చూసుకోవాలి" అన్నాడు డాక్టర్. "ఫర్ ఎవర్ భరించాలి" కొంచెం సేపాగి అన్నాడు డా॥ మాథుర్.

"అంటే జీవితాంతం ఇంతేనా సార్?" మాట్లాడలేకపోయాడు శివకుమార్.

"కంట్రోల్ యువర్‌సెల్ఫ్. ఏదైనా టైం గడిచేకొంద్దీ కొద్దికొద్దిగా మార్పులు రావచ్చు. ఫిజియోథెరపి చేయిస్తూ వుండండి. ఎదిగేకొద్దీ మంచి మార్పులు రావచ్చు.

"మీ దగ్గరకు రావటంలో ఆలస్యం ఏమైనా చేశామా?"

"నో... నో... నాటెటాల్. అది ప్రసవ సమయంలోనే మెదడుకు డామేజ్ జరిగింది."

"ఎంతో కేర్ తీసుకున్నాం. ఇలా ఎందుకు జరిగింది సార్?" శివకుమార్ కళ్ళలో నీళ్ళు.

"డెలివరిటైంలో బిడ్డ మెదడుకు ఆక్సిజన్ తగినంత అందకపోవడం మెదడుపై ఒత్తిడి. తదితర కారణాలు అనేకం. జాండిస్ కూడా తోడయింది."

హాస్పిటల్‌కు వెళ్ళడానికి తాత్సారం చేసిన అత్తగారిపై కోపం విపరీతంగా వచ్చింది. నిర్లిప్తత, నిస్సహాయత, ఒంటరితనం ఆవరించింది.

డాక్టర్ మాథుర్ గారిని కలవడం, ఫిజియోథెరపి సెంటర్‌కి వెళ్ళటం శివకుమార్ నిత్యకృత్యమైంది. కావేరి మానసికంగా కృంగిపోయింది. డిప్రెషన్‌లో కూరుకుపోయింది. బాధకు శబ్దరూపం లేని రోదన. శివకుమార్ జీవితం పగలురాత్రి తేడా తెలియటం లేదు. అన్ని విషయాల పట్ల అనాసక్తి. నెట్లో సెరిబ్రల్ ఫాల్స్ గురించి సెర్చ్‌లో పూర్తిగా పరిశీలించాడు.

శివకుమార్ బిడ్డ కృష్ణచైతన్య కళ్ళు గొప్ప

ఆకర్షణ. వింత సోయగాలతో ఇప్పుడిప్పుడు కళ్ళు కదుల్తున్నాయి. కాన్పు సమయంలో జాగ్రత్త లేకపోవడం కాలయాపన ప్రధాన కారణమని తెలిశాక మనసు కలచివేస్తుంది. ఫలితం బిడ్డ వైకల్యం. పూర్వం కావేరిలో సౌమ్యత, సంస్కారం ఆహ్లాదంగా వుండేది. ఇప్పుడు కావేరి నిశ్శబ్ద చిత్రం.

శివకుమార్ ఉయ్యాల దగ్గరగా వెళ్ళి నిల్చున్నాడు. "ఏందిరా కన్నా?!" అని పలుకరించాడు. ఊయలలోంచి తీసి ముద్దాడాడు. కావేరికి అందించాడు. నిర్లిప్తంగా వుండిపోయింది. బిడ్డకు పరిసరాలు తెలుస్తున్నాయన్న సంగతి మనోల్లాసం కలిగించింది శివకుమార్‌కి.

చైతన్యకు అన్నం పెట్టేందుకు గిన్నెతో కావేరి అమ్మ వచ్చింది. ఆమె కరకుగొంతుతో రణరంగం చేసింది. "జాగ్రత్త. గొంతునరాలు సరిగ్గా వుండవు.. నెమ్మదిగా తినిపించండి."

"నాకు రేగిందంటే పీక పిసికేస్తా" అరిచింది కావేరి తల్లి. బిడ్డకు పొలమారింది.

"ఏందీ పీడ. ఇట్లా అనుకుంటే వడ్లగింజో, జిల్లేడుపాలో పుట్టినప్పుడే వేస్తే పీడా వదిలేది."

"ఏమిటి మీరు మాట్లాడేది బుద్ధుందా మీకు?"

"లేకపోతే ఏందయ్యా ఈ ముదనష్టపు పీడ" విసురుగా బిడ్డను లాక్కొని లోపలికి వెళ్ళాడు.

× × ×

రావుగారు నగరంలో ప్రసిద్ధ అయుర్వేద వైద్యులు. రావుగారి కొడుకు సాఫ్ట్‌వేర్ కంపెనీ డైరెక్టరు. శివకుమార్‌కు బాస్. అతని సలహా మీద రావుగారికి చూపించారు కావేరిని. రావుగారి వైద్యంతో, మాటలతో కావేరి పరిస్థితి కొంచెం మెరుగైనట్లయింది. కావేరి కలివిడిగా వుండటం కలిసి భోజనం చేయటం జరుగుతుంది.

"మెర్సీ కిల్లింగ్ అంటే ఏమిటి బాబు?" అడిగింది కావేరి అమ్మ.

డైనింగ్ టేబుల్‌కు దూరంగా చైతన్య ఉంది. అమెరికా నుంచి ఒక మిత్రుడు పంపిన బాక్ సపోర్టు కుర్చీలో మెడ ఎత్తలేక తలవంచుకుని ఎవరైనా మాట్లాడుతున్నపుడు వాళ్ళవైపు చూస్తుంది.

"ఇప్పుడెందుకా విషయాలు?" కట్ చేశాడు శివకుమార్. ఆవిడ ఆలోచనల మీద వాలకం మీద అనుమానం రేకెత్తింది.

× × ×

ఉదయం కాఫీ తాగుతూ కూర్చున్నారు. కావేరి కొంచెం నార్మల్ పరిస్థితిలోకి వచ్చింది. బ్యాక్‌రెస్ట్ ఛెయిర్ చైతన్య కొద్ది కొద్దిగా పాలు తాగుతున్నది. మధ్యమధ్యలో పొలమారుతున్నది.

"కొంచెం కొంచెం నెమ్మదిగా ద్రవపదార్థంగా ఇవ్వాలి" అని చెప్పాడు కావేరికి.

టి.వి. ఆన్ చేశాడు. మెర్సికిల్లింగ్ గురించి వార్తా కథనం. ఇద్దరూ ఆ కథనం చూస్తూ మౌనంగా వుండిపోయారు.

"చైతన్య జ్ఞానేంద్రియాలు అన్నీ సక్రమంగా పనిచేయడం ప్రారంభించాయి. పరిసరాలు గమనిస్తోంది. శబ్దాలు వింటుంది.

"ఈ మెర్సికిల్లింగ్ మన దేశంలో లీగలైడ్ ఐందా?"

"దాని గురించి ఆలోచించకు."

కావేరి కోలుకుంటున్నది అని అనుకునే సమయంలో ఈ ఆలోచనలు ఈమెకే వస్తున్నాయా? తల్లి కల్పిస్తుందా? అత్తగారు అన్న మాటలు పదే పదే గుర్తుకొస్తున్నాయి.

గుంటూరులో వున్న మామగారు ఆసుపత్రిలో చేరారని సీరియస్‌గా వుందని ఫోన్ వచ్చింది. కోలుకుంటున్న కావేరిని వదలడం ఇష్టంలేక చైతన్యను కావేరిని తీసుకుని అత్తగారు గుంటూరుకెళ్ళింది. వెళ్ళిన రెండు రోజులకు ఆయన కోలుకుంటున్నారని వారంలో తిరిగి వస్తామని కావేరి ఫోన్ చేసి వీలైతే వీకెండ్‌లో రమ్మని చెప్పింది. చైతన్యకు ఫిట్స్ వస్తున్నాయని ఫోన్ మళ్ళీ. వెంటనే బయలుదేరి రమ్మని ఫోన్. బైలుదేరి వెళ్ళాడు శివకుమార్.

ఆసుపత్రి బెడ్ మీద ఆక్సిజన్ మాస్క్‌లో చైతన్య. దగ్గరిగా వెళ్ళి చూశాడు.

"అమ్మలూ!"

"అమ్మలూ" పెద్దగా అరిచాడు.

కన్వల్షన్స్ మళ్ళీ మొదలయ్యాయి. రెప్పలు బరువుగా ఎత్తి చూసింది. కళ్ళల్లోంచి దివ్య జ్యోత్నులు. శరీరం ఒక్కసారిగా బిగుసుకుంది. మరి రెప్పలు మూతపడలేదు. డాక్టరువచ్చి రెప్పలు మూశారు. శివకుమార్ మనస్సులో రెండు ప్రశ్నలు.

(ఆకాశవాణి సౌజన్యంతో..)

## భవిష్యత్తు

ఒరియా మూలం : **కుమ్ కుమ్ రాయ్**

తెలుగు అనువాదం : **ఉపద్రష్ట అనూరాధ**

నేనెప్పుడు పుట్టానో
ఎక్కడ పుట్టానో
నాకు తెలియదు.
నా జాతకం నేనెరగను.
నాన్న పేరు గాని
అమ్మ అడ్రసు గాని
నాకు తెలియదు
దొరికినప్పుడు గుక్కెడు
గంజి తాగుతూ
పట్టెడు మెతుకులు కతుకుతూ
గాలికీ ధూళికీ పెరుగుతూంటే
నాకు తెలిసొచ్చింది
ఆకాశంలో చందురుడే రానీ
సూరీడే పోనీ
చుక్కలే పొడవనీ
నేను మైమరచిపోకూడదు.
అది ఫాల్గుణం కావచ్చు.
అది వసంతం అవొచ్చు.
నాకు మాత్రం మైమరపు కూడదు
నేను పాటలు పాడకూడదు
ఆటలు ఆడకూడదు
సీతాకోకచిలుకలు పట్టకూడదు
పెన్ను ముట్టకూడదు
ఆకాశంలో చుక్కల చాటున
దాగున్న మా అమ్మని వెతక్కూడదు.
నా భవిష్యత్తుని వెతుకుతున్నాను
పరుగెత్తుతున్న రైల్లోని
ప్రయాణీకుల కాలిజోళ్ల ధూళిలోను
వీధుల వార గల పెంటకుప్పల్లోను
లోతు కొలవలేని సముద్రంలోను
భూమి కడుపులోనో
పాతాళంలోనో పాతుకుపోయిన
నా భవిష్యత్తుని గాలిస్తున్నాను
నా యజమాని మాటల్ని
మన్నించడంలోనే
నా బాల్యం ఆవిరైపోతోంది.
నేను అన్నం వారుస్తున్నప్పుడు
దుఃఖాన్ని చందనంలా
వంటినిండా పూసుకుంటాను
నా జీవితం వేదనామయం
చద్దికూడులోని గుప్పెడు మెతుకులు
నా చెయ్యి జారితే అమ్మగోరు పెట్టే
వాతలమంటని కన్నీటితో దిగమింగుతా
నా యజమానుల కోసమే
దాచి వుంచాను
నా నెత్తుటిని, చెమటని,
బుద్ధిని, బలాన్ని
యావత్తు ఆయుష్షుని,
భవిష్యత్తుని.